తెలుగు కళా సమితి (న్యూ జెర్సీ) చిన్న కథల పోటీలో రు. 200 గెలుచుకున్న రచన

**మా** రవి వద్ద నుండి అటువంటి సమాధానం వస్తుందని నేను కలలో కూడా అనుకోలేకపోయేను. అందుకనే కొన్ని క్షణాలు నోటి మాట లేక నిశ్చేష్టుడనయిపోయేను.

వెధవకి నిండా పదిహేనేళ్ళు లేవు. అంతవరకు నేను చెప్పిన పనులన్నీ శిరసా వహించి చేసేవాడు. ఇంట్లోను వాళ్ళ అన్నలూ, అక్కలూ చెప్పిన పనులు అట్లాగే చేసేవాడు... ఎన్నడూ ఎదురు చెప్పకుండా, మరి ఇవేళ నా దగ్గరే వచ్చింది తిరకాసు.

పొద్దున్నే కాఫీ తాగేక, పేపరు చూడబోతూ సిగరెట్ పెట్టె తెరిచేను. సిగరెట్లు నిండుకున్నాయి. ఆఖరి సిగరెట్ వుదయాన్నే కాల్చేసినట్లున్నాను. అందుచేత రవిని పిల్చి డబ్బు లిచ్చి 'సిగరెట్ పెట్టె ఒకటి పట్టుకు రారా' అన్నాను. వాడు నా మొహాన్ని ఒకసారి ఎగాదిగా చూసి, డబ్బుల్ని బల్ల మీన పడేసి, 'సిగరట్లయితే నేను తేను. మరేదైనా కావలిస్తే చెప్పండి' అన్నాడు. నేను నిశ్చేష్టుడనయిపోయెను. 'అదేంట్రా, సిగరెట్స్ అయిపోయేయి, ఒక పెట్టె పట్టుకుని రా వెళ్ళి' అన్నాను. 'ఊహూ. నిన్న సాయంకాలం తెస్తే అప్పుడే అన్నీ కాల్చేస్తే ఎట్లా? నేను తేను' అన్నాడు మరో వైపు చూస్తూ.

"ఒరే! తల్లి తండ్రుల మాట, గురువు మాట శిరసా వహించాలిరా. టి.వి.లో రామాయణం చూస్తున్నావు కదా! దశరథుడు శ్రీరామచంద్రుడ్ని అడవులకి వెళ్ళమంటే నీలాగే వాదించేడా? మాట్లాడకుండా అడవికి వెళ్ళి పోలేదా?' అన్నాను- యీ దెబ్బతో వాడు దోవకి వచ్చి నాకు సిగరెట్ పెట్టె తెచ్చి ఇస్తాడనే ఆశతో. "మీరేం చెప్పినా చేస్తా! సిగరెట్లు మాత్రం తేను, అంతే." అంటూ అవతల గదిలోకి వెళ్ళిపోయేడు.

వాడు బుద్ధిమంతుడే! కాదనను. రాత్రంతా దగ్గుతో, ఆయాసంతో బాధపడడం చూసేడు. ఊపిరి అందకపోతే విసన క్ర్ర పుచ్చుకుని పది నిమిషాలు పైగా విసిరేడు పాపం! నా మంచికోసమే ఆ సిగరెట్లు తేనన్నాడు వాడు. కానీ యిప్పుడు మరి మార్గమేమిటి? పెద్ద వాడిని తెమ్మంటే మండి పడతాడు.

నాలుగు రోజుల క్రితం ఆయాసం ఎక్కువయి కిందా మీదా అయిపోతే ఆఫీసుకి వెళ్ళేవాడు ఆగిపోయి, డాక్టర్ దగ్గరకి పరుగెత్తి, దగ్గరుండి పిల్చుకొచ్చి, డెరిఫ్లిన్ ఇంజక్షన్ ఇప్పించి, అప్పటికి గండం నుంచి బయట పడేసేడు. అప్పుడే డాక్టర్ గట్టిగా చెప్పేడు, సిగరెట్లు పూర్తిగా మానెయ్యాలండీ! లేకపోతే ఈ వ్యాధి తగ్గదు. మీ వూపిరితిత్తులు ఇప్పటికే బాగా దెబ్బ తినేసేయి. ఈ ఇంజక్షన్లు యివీ - తాత్కాలిక చికిత్స మాత్రమే. యోగాసనాలు వేస్తూ, బలమైన ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా సిగరెట్ల జోలికి పోగూడదు. ఆపైన మీ ఇష్టం' అని హెచ్చరించి వెళ్ళి పోయేడు. ఆ డాక్టర్ అటు వెళ్ళగానే "విన్నావుగా! రాత్రింబవళ్ళు ఆయాస పడుతూ, దగ్గుతూ నువ్వు గాభరాపడి, మమ్మల్ని గాభరా పెట్టేస్తే ఎట్లా? ఆ సిగరెట్ల వల్ల కేన్సర్ వస్తోందని డాక్టర్లు పేపర్లనిండా గోల పెడ్తున్నారు. కేన్సర్ వల్ల చనిపోయే వాళ్ళల్లో 35% వూపిరి తిత్తుల కేన్సర్ వల్లనని కూడా అంటున్నారు. అందుచేత నీ వూపిరి తిత్తులు ఇంకా పాడవకుండా వుండాలంటే సిగరెట్లకి ఈవేళ నుంచి వుద్వాసన చెప్పెయ్యి. పెద్దవాడివి- అన్నీ నీకూ తెల్సు. నేను నీకు చెప్పవలసిన వాణ్ణి కాదు. నీ కోసం కాకపోయినా, ఇంకా నిన్ను ప్రేమించే నీ పిల్లల కోసమైనా ఆ పాడు అలవాటు మానెయ్యి నాన్నా" అంటూ కన్నీళ్ళు తుడుచుకుని, నిలబడలేక వెళ్ళిపోయేడు.


అవును. వాళ్ళు చెప్పినవీ, డాక్టర్ చెప్పినవీ అన్నీ నిజమే. కాదనను. కానీ నేను ఈ దురలవాటుకి బానిసని. శరీరం, ఆత్మ కూడా అమ్ముకున్నాను ఈ అలవాటుకి. దీనిని వదల్చుకోవాలని వ్యర్థ ప్రయత్నాలుచేసి, నిరాశతో, లొంగిపోయిన వాణ్ణి నేను. అది లేకపోతే తోచదు. ఆనందంగా వున్నా, విచారంగా వున్నా మూడ్ బాగా వున్నా, లేకపోయినా చప్పున సిగరెట్ వెలిగించాల్సిందే. ఏ గొప్ప ఆలోచన రావాలన్నా, ఏ మంచి పని చెయ్యాలన్నా చేతిలో సిగరెట్ ఎర్రగా కాల్తూ వుండాల్సిందే. కణ కణ మండే ఆ సిగరెట్ని ఒక్క గుక్క పీల్చి వదిల్తే ఎంత హాయిగా వుంటుందో ఎట్లా చెప్పను? చలి కాలంలో గానీ, వేసవిలో గానీ, గుండె నిండా నిండిన ఆ పొగ ఎంత ఆనందాన్ని, ఎంత మాధుర్యాన్ని ఇస్తుందో, ఎన్ని ఆలోచనల్ని ప్రేరేపిస్తుందో, ఎంత శాంతిని యిస్తుందో ఎట్లా చెప్పను?

అది లేకపోతే పిచ్చెత్తినట్లు వుంటుంటుంది. ఏ పనీ చెయ్యబుద్ధి కాదు. స్తబ్దుగా కూర్చుండిపోవలసింది. నిర్జీవంగా, నిస్తేజంగా వుంటుంది. చెప్పలేని దిగులు. మోయలేని బరువు మనస్సు నిండా. ఎంత నిస్సారం ఈ జీవితం అనిపిస్తుంది. ప్రేమించే మనుషులపైన కూడా కోపం. లోకంపైన రోత. శబ్దాలు భరించలేం. అన్నం రుచించదు. సంగీతం సహించదు. ప్రపంచానికే పిచ్చి పట్టిందా అనిపిస్తుంది.

"నాన్నా! ఇవ్వేళ మంచి టైపు నేర్చుకోవా?" అన్నది మా అమ్మాయి శారద వచ్చి భయం భయంగా చూస్తూ.

ఏం చెప్పను? నేర్చుకుంటే నాకేం? నేర్చుకోకపోతే నాకేం? నా బాధ ఎవ్వరూ అర్థం చేసుకోరు. ఎవ్వరికీ అక్కర్లేదు. దానికి టైపు నేర్చుకోవడం ముఖ్యం. నాన్న ఎందుకు అట్లా దిగాలుగా వున్నాడు అని ఎవ్వరూ ఆలోచించరు? ఈ కాలం పిల్లలు ఎంతగా ఎదిగిపోయేరు. ఎవరి స్వార్థం






వాళ్ళది. ఇంకోళ్ళ గొడవ, బాధ ఎవ్వరికీ పట్టదు. కాస్సేపున్నాక రవి గాడే వచ్చి పాలిటెక్నిక్ అప్లికేషన్ ఫారం కోసం డిమేండ్ డ్రాఫ్టుకి 10 రూ.లు కావాలంటాడు. నిన్న అడిగితే యివ్వాళ చూద్దాం అన్నాను. అడగని చూద్దాం, సరైన సమాధానం ఇస్తాను. కోపంతో కుతకుతలాడిపోతోంది మనస్సు. ఇంత బ్రతుకూ బతికి, ఇంత సంపాదించి, ఇన్నాళ్ళు ఈ పిల్లల కోసం ఇంత శ్రమించి, ఈనాడు రిటైరు అయ్యి, హాయిగా వుండాలంటే కూడా లేదు. ఒక్క సిగరెట్... వెధవది, ఒక్క సిగరెట్‌కి నోచుకోలేదు ఈ ప్రాణం. ఛ, ఏం బ్రతుకు! అసలు ఈ అలవాటు చేసిన వెధవని అనాలి. ఎట్లా అయిందో ఈ అలవాటు... 40... వుహూ... 50, వుహూ... 52 ఏళ్ళ క్రితం వెతకాలి... నేరస్థుడి కోసం.

అప్పుడు 12 ఏళ్ళో, 13 ఏళ్ళో... అంతే. అవి ధనుర్మాసం రోజులు. తెల్లారే లేసి మా అమ్మ నన్నూ, మా తమ్ముణ్ణీ గుడికి పంపేది. ప్రక్కింటి సింగ్, వాడి తమ్ముడు, ఎదురింటి శర్మ, వాడి చెల్లెలు అంతా సిద్ధంగా వుండేవారు. గజగజ వణికించే చలి. పొగ మంచు. అయిదు అవ్వకుండానే లేచి అంతా కలిసి కబుర్లు చెప్పుకుంటూ నాసు దేవాలయం చేరేవాళ్ళం. పూజ అయ్యే వరకు ఆగి నైవేద్యం పెట్టేక, పంచి పెట్టే ప్రసాదం కోసం లైను కట్టి నిలబడేవాళ్ళం. పూజారి గారు పట్టు పంచెతో పళ్ళెంలోని ప్రసాదం- (అది ఒక రోజు చక్రపొంగలి, మరో రోజు పులిహోర, మరో రోజు దద్దోజనం- అయ్యేది) అందరికీ బాదం ఆకుల్లో పంచేవారు. కొంచెంగా పెట్టినా, ఎంత రుచిగా వుండేదో ఆ ప్రసాదం. ఆ ప్రసాదం తినేసి కోనేరులో చేతులు కడుక్కుని ఆడుకుంటూ, పాడుకుంటూ ఇళ్ళకు వచ్చే వాళ్ళం. ఇట్లా 'వైకుంఠ ఏకాదశి భోగి' వరకు జరిగేది. భోగి రోజు మహా గొప్పగా వుండేది. ప్రసాదం తినేసి రోడ్డు మధ్య కాలుతూన్న కట్టెల వద్ద (భోగి మంటలు) చలికాగే వాళ్ళం. ఇదే సందని కొందరు నీళ్ళ బిందెలుఅక్కడ వేడి చేసుకునేవారు. సరిగా ఈ సమయంలోనే సింగ్ గారుచలి కాగుతూ జేబులోంచి బీడీ తీసి మంటలో ముట్టించి, నోట్లో పెట్టుకుని పీల్చి పొగ వదిలేడు. ఆశ్చర్యంతో నోరువెళ్ళ బెట్టుకుని నేను చూస్తూ వుంటే అక్కడే ఎదురింటి గోడకి వున్న ఎండిన ఆనపపాదు కాడ నకటి విరిచి ఇచ్చి కాల్చి పీల్చమన్నాడు నాతో. కాల్చి పీలిస్తే, నోరు చుర్రుమన్నది. అవతల పారేసేను. వాడు నవ్వి మర్నాడు, వాళ్ళ నాన జోబీలోంచి ఒక బీడి ఎత్తుకొచ్చి నాకు యిస్తానన్నాడు. మర్నాడు గుడి నుంచి వస్తూ మొదటిసారిగ కాల్పించేడు నాతో బీడీని. అదీ నా మొదటి అనుభవం. ఆ తర్వాత 6వ తరగతిలో మళ్ళీ ఇంకో మిత్రుడు ప్రోద్బలంతో సిగరెట్ కాల్చడం... అప్పుడేమీ ఆనందం లేదు ఆ అనుభవంలో. తర్వాత తర్వాత నాటకాలు ఆడేప్పుడు, నవలలు చదివేప్పుడు, పరీక్షలకి రాత్రుళ్ళు మేల్కొనలసి వచ్చినప్పుడు, పార్టీల లోను, ఆఫీసు పని ఎక్కువైనప్పుడు, తోచినప్పుడు, తోచనప్పుడు, వ్యసనానికి బానిస అవ్వడం అట్లా క్రమక్రమంగా ఆ సింగ్ గాడి దయ వల్ల జరిగింది.

"ఏం నాన్నా?" అన్నది అమ్మాయి మళ్ళీ హెచ్చరికగా. పాపం దాని తప్పేం వుంది. 'అట్లాగే నేర్చుకోమ్మా' అన్నాను ఆలోచనలో నుంచి యివతల కొచ్చి.

దూరంగా రవి నిలబడి వున్నాడు. చేతిలో సిగరెట్ పెట్టె. ఎప్పుడు తెచ్చేడో పాపం... నేను చూడనే లేదు. బల్ల పైన పెట్టి, మాట్లాడక వెళ్ళిపోయేడు అవతలకి. పాపం నా మానసిక క్షోభ చూడలేకపోయినట్లు న్నాడు. కానీ, నేనిట్లా సిగరెట్లు కాలుస్తూ, రాత్రింబగళ్ళూ రొప్పుతూ, దగ్గుతూ చిక్కి శల్యమైపోతూ, రాత్రిళ్ళు నిద్ర పట్టక అవస్థ పడుతూ, ఎక్కడికీ కదలలేక పంజరంలోని పక్షిలాగ ఈ గదిలోనే సిగరెట్ పొగల మధ్య కమిలిపోతూ, కృశించడం వాళ్ళు చూడగలరా? ఇంత మంది పిల్లల్ని, బంధువుల్ని, మిత్రుల్ని మానసిక హింసకి గురి చెయ్యకుండా మానే ప్రయత్నంలో ఆ పడే హింస ఏదో పడితే నేను ఒక్కణ్ణే పడడం మంచిది కాదూ? అవును. అదే మంచిది. ఆరు నూరైనా అదే మంచిది. అట్లాగే చెయ్యాలి. సిగరెట్ పెట్టెను తీసుకుని, నెమ్మదిగా లేచి కిటికీ లోనుంచి బయటకు విసిరేసి- ఓ నిట్టూర్పు విడిచి దినపత్రిక అందుకున్నాను. ●

